



# కరపత్రం

SINCE 2014

గురువారం మార్చి 27 2025 | సంపుటి :0 | సంచిక : 164 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


# ఆన్‌లైన్ బెట్టింగ్ నిరోధానికి సిట్ ఏర్పాటు



- ఆన్‌లైన్ బెట్టింగ్ అనేది అంతర్జాతీయ నేరంగా మారిందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.
- ఈ నేపథ్యంలోనే సిట్ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.



- ఆన్‌లైన్ బెట్టింగ్ నేరంగా మారిందని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.
- ఆన్‌లైన్ బెట్టింగ్, రమ్మీ పట్ల కఠిన చర్యలు తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం.
- సిట్ ఏర్పాటు చేసి బెట్టింగ్, రమ్మీ నిరోధానికి చర్యలు చేపట్టనున్న ప్రభుత్వం.
- శిక్షలను మరింత కఠినతరం చేయాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయం.

## కాళేశ్వరం డిజైన్, నిర్మాణంలో తీవ్ర లోపాలు: మంత్రి ఉత్తమ్



మేడిగడ్డ బ్యారేజీ అంశంలో విజిలెన్స్ నివేదిక వచ్చిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఎన్డీఎస్ఏ తుది నివేదిక వచ్చిన తర్వాత మరమ్మతుల విషయంపై దృష్టిసారిస్తామన్నారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా భాజపా ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు లేవలెత్తిన అంశాలపై మంత్రి వివరణ ఇచ్చారు. కాళేశ్వరం ఆనకట్టల డిజైన్, నిర్మాణం, నిర్వహణలో తీవ్రమైన లోపాలు ఉన్నాయని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. డీపీఆర్‌లో షీట్ పైల్స్ ఉంటే.. నిర్మాణంలో సీకెంట్ పైల్స్ వాడారని చెప్పారు. 2లో



## హైదరాబాద్‌లో ఐపీఎల్ మ్యాచ్‌లు.. ఉప్పల్ స్టేడియానికి ప్రత్యేక బస్సులు

ఉప్పల్ స్టేడియంలో జరిగే ఐపీఎల్ మ్యాచ్‌లు తిలకించే క్రికెట్ అభిమానుల కోసం టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్ సర్వీసులు ఏర్పాటు చేస్తోంది. 2లో


## కేసీఆర్, హరీశ్‌రావును క్రిమినల్ ప్రాసిక్యూషన్ చేయాలి: భాజపా ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై భాజపా ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు శాసనసభ వేదికగా ఘాటు వ్యాఖ్యలు చేశారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. 2లో



### సుప్రీంకోర్టును అవమానించేలా సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు..

## అసెంబ్లీలో హరీశ్‌రావు ధ్వజం



హైదరాబాద్ : సుప్రీంకోర్టును అవమానించేలా సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. సుప్రీంకోర్టులో విచారణ నడుస్తున్న సమయంలో, రేవంత్ రెడ్డి ఉపఎన్నికలు రావు అని చెప్పడం కరెక్ట్ కాదు అది న్యాయస్థానానికి అవమానం అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు పేర్కొన్నారు.
అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో ఉప ఎన్నికలు రావు.. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు భయపడకండి అని సీఎం వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై హరీశ్‌రావు తీవ్రంగా స్పందిస్తూ.. పాయింట్ ఆఫ్ ఆర్డర్‌ను లేవనెత్తారు.
హరీశ్‌రావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఈ హౌజ్‌కు ఇమ్యూనిటీ ఉంది.. ఈ హౌజ్‌లో కోర్టుల గురించి కూడా ఏదైనా మాట్లాడొచ్చు అని ముఖ్యమంత్రి మాట్లాడారు. ఈ పది మంది ఎమ్మెల్యేలు డిస్క్వాలిఫై కారు. అది గతంలో కాలేదు. ఇప్పుడు కూడా కాదు అని సీఎం అంటే.. నేను వెంటనే సుప్రీంకోర్టులో ఉన్న మ్యాటర్‌ని మీరు ఎట్ల మాట్లాడుతారని ప్రశ్నిస్తే.. మాకు ఇమ్యూనిటీ ఉంది.. ఈ సభలో ఏదైనా మాట్లాడొచ్చు అని అన్నారు. అయితే ఈ సందర్భంగా చెబుతున్నాం.. జడ్జి గారి రిమూవల్ గురించి తప్ప సుప్రీంకోర్టు, హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నటువంటి విషయాన్ని సభలో మాట్లాడకూడదనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఇవాళ ముఖ్యమంత్రి సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టును అవమానించేలా మాట్లాడారని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.
ఇక సభలో మాట్లాడేందుకు అవకాశం ఇవ్వలేదంటూ.. స్పీకర్ పోడియం వద్ద బీఆర్ఎస్ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభ నుంచి వాకౌట్ చేశారు.

## అసెంబ్లీలో వాడీవేడిగా మాటల యుద్ధం

- కేటీఆర్ వర్సెస్ భట్టి
- కమీషన్ లేనిదే పనులు కావడం లేదంటూ కేటీఆర్ ఆరోపణలు
- నిరూపించకపోతే.. క్షమాపణలు చెప్పాలని భట్టి డిమాండ్

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు పదోరోజు వాడీవేడిగా కొనసాగింది. పలు అంశాలపై సుదీర్ఘ చర్చ కొనసాగుతోంది.. ఈ క్రమంలో తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మధ్య మాటల యుద్ధం నడిచింది. ప్రభుత్వ పెద్దలు 30శాతం కమీషన్లు తీసుకుంటున్నారంటూ.. స్వయంగా కాంగ్రెస్ నేతలే మాట్లాడుకుంటున్నారంటూ అసెంబ్లీ వేదికగా కేటీఆర్ కామెంట్ చేశారు. అయితే.. కేటీఆర్ చేసిన ఈ వ్యాఖ్యల పట్ల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 30శాతం కమీషన్లు తీసుకుంటున్నట్లు నిరూపించాలంటూ కేటీఆర్‌కు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సవాల్ చేశారు. 2లో



## డీడీఎంఎస్ లిటరసీ హౌజ్‌లో వివిధ సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం




2లో

## భద్రాచలంలో కుప్పకూలిన ఆరంతస్తుల భవనం.. పలువురి మృతి

- భద్రాచలం: భద్రాచలం పట్టణంలో ఘోర ప్రమాదం జరిగింది.
- నిర్మాణంలో ఉన్న ఆరంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది.

భద్రాచలం పట్టణంలోని సూపర్ బజార్ సెంటర్‌లో ఆరంతస్తుల మేర స్లాబ్ నిర్మాణం చేపట్టి వదిలేశారు. ఈ భవనం బుధవారం మధ్యాహ్నం హఠాత్తుగా కుప్పకూలింది. ఈ ఘటనలో పలువురు మృతి చెందగా.. భవనం శిథిలాల కింద నలుగురు చిక్కుకున్నట్లు తెలుస్తోంది. భవనం కూలిపోవడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. 2లో



# సంపాదకీయం

## న్యాయవ్యవస్థ పతనానికి కారణం ఎవరు?

మృగాలు వేటాడి తమ ఆకలిని తీర్చుకున్న తర్వాత శాంతిస్తాయి కాని అవినీతి అనే ఆకలి ఉన్న మనిషి అంత త్వరగా శాంతించడు. ఆఫీసుల్లో, రహదారుల కూడళ్లలో, ప్రార్థనా మందిరాల్లో అంతటా మనిషి మనిషిని వేటాడడం మనకు కనిపిస్తోంది. ఎన్నికల రాజకీయాల్లో కోట్ల రూపాయలు ప్రవహిస్తూనే ఉంటాయి. రాజకీయ పార్టీలకు నిధుల సమీకరణ ఎవరి ద్వారా చేయాలో బాగా తెలుసు. ముఖ్యంగా అధికారంలో ఉన్న పార్టీకి నిధుల సమీకరణకు అనేక మార్గాలు ఉంటాయి. ఎందుకంటే అన్ని వ్యవస్థలూ వారికి అనుకూలంగా పనిచేస్తాయి. హవాలా మార్గాలు దేశమంతటా విస్తృతంగా పనిచేస్తూనే ఉంటాయి. పార్లమెంట్‌లో కీలకమైన ఓటింగ్ జరిగినప్పుడు ప్రజాప్రతినిధులను ప్రలోభపరిచిన ఉదంతాలు, నిండు సభలో నోట్ల కట్టలు రెపరెపలాడిన సంఘటనలు ఎన్నో. ఈ దేశంలో పెద్ద నోట్ల రద్దు జరిగినప్పుడు కూడా డబ్బు ప్రవాహం ఆగనే లేదు. అప్పుడప్పుడూ ఆదాయపన్ను శాఖ, ఈడీ అధికారులు దాడులు చేసి కోట్ల రూపాయల నోట్ల కట్టలను ఏ మంత్రి పీఏ ఇంటిలోనో, ఏ అధికారి నివాసంలోనో పట్టుకున్నట్లు వార్తలు వస్తాయి. కాని ఇది కంటితుడుపు మాత్రమే.భారతదేశంలో అవినీతి సర్వాంతర్యామి. 62 శాతం మంది భారతీయులు తమ పనులకోసం ఎప్పుడో ఒకప్పుడు లంచాలు చెల్లించినవారేనని ట్రాన్స్పరెన్సీ ఇంటర్నేషనల్ వెల్లడించింది. గత ఏడాది ఈ సంస్థ ప్రకటించిన నివేదిక ప్రకారం 180 దేశాల్లో భారతదేశం అవినీతి 96వ ర్యాంకును సాధించింది. స్కూలు అడ్మిషన్ల నుంచి సామాజిక సంక్షేమ కార్యక్రమాల అమలు వరకూ ఏ రంగమూ అవినీతికి మినహాయింపు కాదని, లైసెన్స్‌రాజ్ రద్దయినా ఈ దేశంలో ప్రైవేట్ రంగం అత్యధికంగా ప్రభుత్వ రంగంలో పెద్దల చుట్టూ తిరగాల్సి వస్తోందని అందరికీ తెలుసు. 'భారత దేశంలో ఏ బడా ప్రైవేట్ సంస్థ ప్రభుత్వ ప్రాపకం లేకుండా ఎదిగిందో చెప్పండి'. అని కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి ఒక సందర్భంలో ప్రశ్నించారు. భారత దేశంలో ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం ఎంత బలంగా వేళ్లూనికొని ఉన్నదో రాజకీయ నాయకుల కంటే ఎవరికి ఎక్కువ తెలుసు? ఈ నేపథ్యంలో గతవారం ఢిల్లీ హై కోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మ నివాసంలో నోట్లకట్టలు దొరికాయని వార్తలు రావడం పెద్దగా ఆశ్చర్యం కలిగించదు. న్యాయమూర్తులు సంపాదనకు అతీతులని ఈ దేశంలో ఎంతమంది విశ్వసిస్తున్నారు? న్యాయమూర్తులను ప్రలోభపెట్టి తీర్పులను అనుకూలంగా తెప్పించుకునేందుకు, లేదా కేసులను వాయిదా వేయించుకునేందుకు నిరంతర ప్రయత్నాలు చేసేవాళ్లు నిరంతరం ఎక్కడో ఒకచోట తటస్థిస్తూనే ఉంటారు. 'న్యాయమూర్తులేమీ దేవతలు కాదు, వారు కూడా ఇదే సమాజంలో భాగం' అని ప్రముఖ న్యాయవాది రాంజెత్మలానీ ఒక సందర్భంలో చెప్పారు. న్యాయవ్యవస్థ లోపాల గురించి అనేక రచనలు వచ్చాయి. రావి శాస్త్రి న్యాయవ్యవస్థలో కుళ్లును బట్టబయలు చేశారు. 'కోర్టు అంటే ఏమిటో తెలుసా.. అదొక పెద్ద అడవి. అడవిలోకి వచ్చినవాడిదే పొరపాటు కాని మనది కాదు. అక్కడ హైనాల వంటి పెద్ద పెద్ద జంతువులుంటాయి. జాగ్రత్తగా ఉండకపోతే అవి మననే తినేస్తాయి..' అని రావి శాస్త్రి రచించిన 'మాయ' అనే కథలో న్యాయస్థానాల గురించి అభివర్ణిస్తారు. 'ప్లీడరు బాబూ సెప్తున్నా విను. ఏ మనిషీ మంచోడని ఎవరు చెప్పినా నేను నమ్మను.ఈ లోకంలో డబ్బూ యాపారం తప్ప మరేటీ లేదు' అని ముత్యాలమ్మ అనే సారా అమ్ముకునే స్త్రీ ద్వారా ఆయన చెప్పిస్తారు. న్యాయమూర్తుల్లో ఎంత శాతం మంది అవినీతిపరులో అన్న విషయంపై చాలా కాలంగా చర్చ జరుగుతూనే ఉన్నది. సుప్రీంకోర్టు, హై కోర్టు న్యాయమూర్తుల్లో 50 శాతం మంది అవినీతిపరులేనని సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్న మార్కండేయ కట్జూ కూడా ఒకప్పుడు వ్యాఖ్యానించారు. మార్కండేయ కట్జూ కూడా యశ్వంత్ వర్మ మాదిరే అలహాబాద్‌కు చెందినవారే. అలహాబాద్ హై కోర్టులో తీవ్ర అవినీతికి పాల్పడుతున్న న్యాయమూర్తుల జాబితాను తాను అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లహోటీకి ఇచ్చానని, కాని ఆయన ఏ చర్యా తీసుకోలేదని ఖట్జూ వెల్లడించారు. తాను వారి అవినీతి గురించి సాక్ష్యాధారాలతో సహా బయటపెడతానని ఖట్జూ అన్నప్పుడు అలా చేయవద్దని జస్టిస్ లహోటీ ఆయనను బతిమిలాడారు. 'దయచేసి అలా చేయకండి. న్యాయవ్యవస్థలో అవినీతి గురించి మనమే ప్రచారం చేస్తే రాజకీయ నాయకులు దాన్ని తమకు అనువుగా వాడుకుంటారు. జాతీయ జ్యుడిషియల్ కమిషన్‌ను నియమిస్తారు.' అని జస్టిస్ లహోటీ ఆయనను అభ్యర్థించారు. అవినీతిపరులైన ఆ న్యాయమూర్తుల్లో కొందరిని బదిలీ చేసి ఊరుకున్నారు. ఇప్పుడు జస్టిస్ యశ్వంత్ వర్మ విషయంలో అదే జరిగింది. అసలు న్యాయవ్యవస్థలో ఉన్న బలహీనతలను అధికారంలో ఉన్నవారు వాడుకొననిది ఎప్పుడు? అధికారంలో ఉన్న ప్రతి ప్రభుత్వం న్యాయవ్యవస్థ తనకు అనుకూలంగా ఉండాలనే భావిస్తుంది.దీన్ని ప్రతిఘటించి తన స్వతంత్రతను కాపాడుకునే ప్రయత్నాలు చేసిన, ప్రభుత్వాలు తప్పు చేస్తే నిలదీసిన న్యాయమూర్తులు లేకపోలేదు. న్యాయమూర్తుల నియామకాల్లో రాజకీయ జోక్యం ఉండరాదని తొలి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కానియా నెహ్రూకు లేఖ రాసి స్పష్టం చేశారు. 1994లో జస్టిస్ వెంకటాచలయ్య పదవీవిరమణ తర్వాత ప్రభుత్వాలను బలంగా ప్రశ్నించే ప్రధాన న్యాయమూర్తులు అడపాదడపా మాత్రమే ప్రత్యక్షమవుతున్నారు. క్రమంగా న్యాయవ్యవస్థ బలహీనపడుతున్నదనే అభిప్రాయం సర్వత్రా ఏర్పడుతోంది. ఢిల్లీ హై కోర్టు న్యాయమూర్తి నివాసంలో డబ్బులు దొరకడం గురించి అనేక కథనాలు వచ్చినప్పటికీ ఎక్కడా ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు. అదంతా ఆయన ఊళ్లో లేనప్పుడు జరిగిన కుట్ర అని, దీని వెనుక పెద్ద రాజకీయ వ్యూహం ఉన్నదని వాదించేవారు కూడా ఉన్నారు. అత్యంత శక్తివంతమైన ఢిల్లీ హై కోర్టు, కొలీజియంపై అలహాబాద్‌కు చెందిన న్యాయమూర్తుల పట్టు ఉన్నదని, దాన్ని సడలించేందుకే ఈ ఉదంతం జరిగిందని ఒక సీనియర్ న్యాయవాది చెప్పారు. ఏది ఏమైనా ఈ ఉదంతంతో ప్రభుత్వానికి న్యాయవ్యవస్థపై పట్టు బిగించే అవకాశం లభించిందని మాజీ న్యాయమూర్తి ఒకరు అన్నారు. గతంలో జస్టిస్ లహోటీ భయపడినట్లే జాతీయ జ్యుడిషియల్ కమిషన్ నియామకానికి మరోసారి ప్రభుత్వం ప్రయత్నించేందుకు రంగం సిద్ధమవుతున్నదేమో? న్యాయ వ్యవస్థ తీవ్రంగా అప్రతిష్ఠపాలయినప్పుడు దాన్ని సరిదిద్ది న్యాయమూర్తుల నియామకాన్ని ఒక స్వతంత్ర సంస్థకు అప్పజెప్పేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తే ప్రజలు హర్షించవచ్చు. కాని న్యాయవ్యవస్థ బలహీనపడటానికి బాధ్యులు ఎవరు? ఒక ప్రైవేట్ కంపెనీకి అనుకూలంగా తీర్పునిచ్చేందుకు ఒక హై కోర్టు అదనపు న్యాయమూర్తి మరో ఇద్దరు న్యాయమూర్తులను ఒత్తిడి చేశారన్న ఫిర్యాదుపై ఇటీవల లోక్‌పాల్ విచారణకు సిద్ధపడితే సుప్రీంకోర్టు స్టే విధించింది. 'ఇది చాలా ఆందోళనకరం' అని జస్టిస్ గవాయి వ్యాఖ్యానించారు. రాజకీయ నాయకులు, అధికారులతో సమానంగా హైకోర్టు న్యాయమూర్తులపై వచ్చిన అవినీతి ఆరోపణలపై కూడా విచారించే అధికారం లోక్‌పాల్‌కు ఉన్నదా లేదా అని తామే తేల్చాలని సుప్రీంకోర్టు నిర్ణయించుకుంది. నిజానికి లోక్‌పాల్ కూడా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఖాన్విల్కర్ ఆధ్వర్యంలో ఉన్నదే.మరి లోక్‌పాల్‌కు హై కోర్టు న్యాయమూర్తులపై విచారించే అధికారం ఎందుకు లేదు? అంతర్గత విచారణ పేరుతో తమ న్యాయమూర్తులపై వచ్చిన ఆరోపణలను తమే రహస్యంగా విచారించి ఏ చర్యా తీసుకోకుండా వదిలేయడం, మహా అయితే బదిలీ చేయడం సుప్రీంకోర్టు కొలీజియం ఇంతకాలం చేస్తూవస్తోంది. 'స్థానం మారినంత మాత్రాన అవినీతి లక్షణాలు మారుతాయా?' అని ప్రముఖ న్యాయకోవిదుడు ఉపేంద్ర బక్షి ఒక ఇంటర్వ్యూలో ప్రశ్నించారు. న్యాయమూర్తుల అవినీతి, అక్రమాల గురించి బయట విస్తృతంగా చర్చకు వస్తే న్యాయవ్యవస్థ అప్రతిష్టపాలవుతోందని, ప్రజలకు న్యాయవ్యవస్థ పట్ల గౌరవం పోతుందని వారు భయపడుతున్నారు. కాని న్యాయవ్యవస్థలో అవినీతిని కప్పిపుచ్చినంత మాత్రాన ప్రజలకు గౌరవం కలుగుతుందా? ఇది పిల్లి కళ్లు మూసుకుని పాలు తాగితే తనను ఎవరూ గమనించరని భావించినట్లే ఉన్నది.

## హైదరాబాద్‌లో ఐపీఎల్ మ్యాచ్‌లు.. ఉప్పల్ స్టేడియానికి ప్రత్యేక బస్సులు

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: ఉప్పల్ స్టేడియంలో జరిగే ఐపీఎల్ మ్యాచ్‌లు తిలకించే క్రికెట్ అభిమానుల కోసం టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్ సర్వీసులు ఏర్పాటు చేస్తోంది. వివిధ ప్రాంతాల నుంచి ఉప్పల్ స్టేడియానికి వచ్చేందుకు గ్రేటర్ పరిధిలోని 24 డిపోల నుంచి 60 ప్రత్యేక బస్సులను ఆపరేట్ చేయనుంది. ఐపీఎల్ మ్యాచ్‌లు జరగనున్న తేదీల్లో ఈ సర్వీసులు అందుబాటులో ఉంటాయి.

ఉప్పల్ స్టేడియంలో మార్చ్ 27, ఏప్రిల్ 6, 12, 23, మే 5, 10, 20, 21 తేదీల్లో మ్యాచ్‌లు జరగనున్నాయి. ప్రధానంగా ఘట్‌కేసర్, హయత్‌నగర్, ఎన్జీవోస్ కాలనీ, ఎల్బీనగర్, కోఠి, లక్డీకాపూల్, దిల్‌సుఖ్‌నగర్, మేడ్చల్, కేపీహెచ్‌బీ, మియాపూర్, జేబీఎస్, ఈసీఐఎల్, బోయిన్‌పల్లి, చార్మినార్, చాంద్రాయణగుట్ట, మెహదీపట్నం, బీహెచ్‌ఈఎల్ వంటి వివిధ ప్రాంతాల నుంచి ఉప్పల్ స్టేడియం వరకు ఆర్టీసీ స్పెషల్ బస్సులు నడపనుంది.

## భద్రాచలంలో కుప్పకూలిన ఆరంతస్తుల భవనం.. పలువురి మృతి

మొదటి పేజీ తరువాయి

పాత భవనంపైనే మరో నాలుగు అంతస్తులు నిర్మిస్తుండగా ప్రమాదం జరిగింది. నిర్మాణంలో లోపాల వల్లే ఘటన జరిగినట్టు అధికారులు భావిస్తున్నారు. నిర్వాహకులు ట్రస్ట్ పేరుతో విరాళాలు సేకరించి భవన నిర్మాణం చేపట్టారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు, రెవెన్యూ, పంచాయతీరాజ్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ఇందుకోసం ఐటీసీ నుంచి క్రేన్లు, పొక్లెయిన్లు రప్పిస్తున్నారు. కూలిన భవనం పక్కనే ఓ ఆలయం కూడా నిర్మిస్తున్నారు.

## డీడీఎంఎస్ లిటరసీ హౌజ్‌లో వివిధ సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

మొదటి పేజీ తరువాయి

ఉస్మానియా యూనివర్సిటీ : ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లోని దుర్గాబాయ్ దేశముఖ్ మహిళా సభ (డీడీఎంఎస్) లిటరసీ హౌజ్‌లో వివిధ సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సర్టిఫికెట్ కోర్సులైన ఎంఎస్ ఆఫీస్ ఇంటర్నెట్, ట్యాలీ ప్రైమ్, బ్యూటీషియన్ కోర్సులతో పాటు స్పోకెన్ ఇంగ్లీష్ అండ్ కెరీర్ గైడెన్స్, పైథాన్, టైలరింగ్, డిజైనర్ బ్లౌజెస్, డ్రెస్ డిజైనింగ్, మగ్గం వర్క్, జూట్ బ్యాగ్ మేకింగ్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ తదితర కోర్సుల్లో అన్ని వయసుల వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు.

వేసవి నేపథ్యంలో ఏడేళ్ల పైబడిన పిల్లలకు పాట్ పెయింటింగ్, గ్లాస్ పెయింటింగ్, డిజైనర్ పేపర్ బ్యాగ్స్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, యోగా, ఫ్లవర్ మేకింగ్, జ్యువెలరీ మేకింగ్ తదితర కోర్సులను అందిస్తున్నట్లు వివరించారు. ఈ కోర్సులలో చేరేందుకు ఆసక్తి ఉన్న వారు వచ్చే నెల 6వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కోర్సులు విద్యార్థులు, నిరుద్యోగ యువత, గృహిణిలకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. సీట్లు పరిమితమని, ముందు వచ్చిన వారికి ప్రథమ ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తామన్నారు. కోర్సుల్లో చేరేందుకు ఎటువంటి వయోపరిమితి లేదని స్పష్టం చేశారు. కోర్సులను విజయవంతంగా పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తామని చెప్పారు. ఇతర వివరాలకు 6281139282 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## గేమింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్‌పై రాష్ట్రాలు చట్టాలు చేయొచ్చు: కేంద్రం



దిల్లీ: గేమింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్ పై రాష్ట్రాలు చట్టాలు చేయొచ్చని బుధవారం కేంద్రం వెల్లడించింది. అవి రాష్ట్ర పరిధిలోని అంశాలని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ లోక్‌సభలో వెల్లడించారు. వీటికట్టడి కేంద్రం కూడా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. డీఎంకే ఎంపీ దయానిధి మారన్ అడిగిన ప్రశ్నకు ఈ మేరకు బదులిచ్చారు. తమిళనాడు ప్రభుత్వం ఆన్‌లైన్ గేమింగ్‌ను నిషేధించిందని, దీనిపై చర్యలు తీసుకోవడంలో కేంద్రం తన నైతిక బాధ్యత నుంచి తప్పించుకుంటుందా..? అని మారన్ ఘాటుగా ప్రశ్నించారు. నిషేధం విధించడానికి ప్రభుత్వానికి ఎంత సమయం కావాలని అడిగారు.

ఈ ప్రశ్నకు వైష్ణవ్ నుంచి అంతే సూటిగా సమాధానం వచ్చింది. కేంద్ర ప్రభుత్వ నైతికతను ప్రశ్నించే హక్కు లేదన్నారు. ఈ అంశంపై చట్టాలు రూపొందించేందుకు రాష్ట్రాలకు రాజ్యాంగం నైతిక, చట్టబద్ధ అధికారాన్ని ఇచ్చిందని గుర్తుచేశారు. "దయచేసి సమాఖ్య నిర్మాణాన్ని అర్థం చేసుకోండి" అని సూచనలు చేశారు. రాష్ట్రాల పరిధిలోని అంశమే అయినా.. తమకు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా 1410 గేమింగ్ సైట్లను ఇప్పటికే నిషేధించామని వెల్లడించారు.

### బెట్టింగ్ యాప్ వ్యవహారం.. మాజీ సీఎం ఇంట్లో సీబీఐ సోదాలు

ఇదిలా ఉంటే.. ఇటీవల కేంద్రం ఆన్‌లైన్ మనీ గేమింగ్ సంస్థల పై కొరడా ఝళిపించి సంగతి తెలిసిందే. అక్రమంగా నిర్వహిస్తోన్న వందల వెబ్‌సైట్లను ఆర్థిక శాఖ పరిధిలోని డీజీజీఐ బ్లాక్ చేసింది. ఆ గేమింగ్ సంస్థలకు చెందిన 2400 బ్యాంక్ ఖాతాలు సీజ్ చేసి, రూ.126 కోట్లను ఫ్రీజ్ చేసింది. అలాగే మనీ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌ల పట్ల అప్రమత్తం ఉండాలని, వాటిని ఎవరూ వాడొద్దని డీజీజీఐ హెచ్చరించింది. "సంస్థలను నమోదు చేయకుండా, ఆదాయాలను దాచిపెడుతూ జీఎస్టీ ఎగవేతలకు పాల్పడుతోన్న చట్టవిరుద్ధమైన ఆన్‌లైన్ మనీ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లపై చర్యలు తీసుకున్నాం. ఐటీశాఖ సమన్వయంతో ఆ వెబ్‌సైట్‌లను బ్లాక్ చేశాం" అని కేంద్రం తెలిపింది.

'సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లతో పాటు బాలీవుడ్ సెలబ్రిటీలు, క్రికెటర్లు ఈ గేమింగ్ సంస్థల ప్రచారంలో పాల్గొంటున్నారని గుర్తించాం. ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ.. వాటికి దూరంగా ఉండాలి. ఆ ప్లాట్‌ఫామ్‌లు వ్యక్తుల ఆర్థిక భద్రతను దెబ్బతీయవచ్చు. దేశ భద్రతను దెబ్బతీసే కార్యకలాపాలకు అవి పరోక్షంగా మద్దతు ఇచ్చే అవకాశాలున్నాయి" అని హెచ్చరించింది.

## అసెంబ్లీలో వాడీవేడిగా మాటల యుద్ధం

మొదటి పేజీ తరువాయి

నిరూపించలేకపోతే కేటీఆర్ క్షమాపణ చెప్పాలని భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. కేటీఆర్ క్షమాపణ చెప్పాలంటూ కాంగ్రెస్ సభ్యులు ఆందోళన చేశారు. ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలంటూ భట్టి హెచ్చరించారు. దోచుకుంది మీరు.. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసింది మీరే అంటూ బీఆర్ఎస్ నేతలపై భట్టి మండిపడ్డారు. కాగా.. కేటీఆర్ క్షమాపణ చెప్పాలంటూ కాంగ్రెస్ సభ్యుల ఆందోళన నేపథ్యంలో.. కేటీఆర్ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ ప్రకటించారు. ధరణి, భూ భారతిపై కూడా తెలంగాణ అసెంబ్లీలో రచ్చ జరిగింది. ధరణిపై విమర్శలు చేసిన కాంగ్రెస్ నేతలు ఇంకా అదే చట్టాన్ని అమలుచేస్తున్నారు. ధరణిలో వివరాల ఆధారంగానే ఇప్పటికీ ప్రభుత్వ పథకాల అమలు జరుగుతుందని.. పైగా ఈ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతిలో అనేక లోపాలు ఉన్నాయన్నారు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి. ఈ వ్యాఖ్యల పట్ల అధికార పార్టీ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ధరణి ఓ దుర్మార్గమైన చట్టమంటూ డిప్యూటీ సీఎం భట్టి మండిపడ్డారు. పార్ట్–బీ పేరుతో భూములు దోచుకున్నారని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఉద్యమాలతో వచ్చిన చట్టాలను ఒక్క కలంపోటుతో వెనక్కు తీసుకెళ్లారు. ధరణిని బంగాళాఖాతంలో కలుపుతామని ఎన్నికల్లో చెప్పాం .. చెప్పినట్టుగానే భూ భారతిని తీసుకొచ్చామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## ఆన్‌లైన్ బెట్టింగ్ నిరోధానికి సిట్ ఏర్పాటు

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: ఆన్‌లైన్ బెట్టింగ్ అనేది అంతర్జాతీయ నేరంగా మారిందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్, రమ్మీ పట్ల కఠినంగా వ్యవహరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. వీటి నిరోధానికి, నిషేధించేందుకు స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) ఏర్పాటు చేయాలనే నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. ఇలాంటి కేసుల్లో పడే శిక్షలను కూడా సవరించాల్సిన అవసరం ఉందన్నారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు."గుట్కా వంటి నిషేధిత పదార్థాల సరఫరా పెరిగిందని తెలుస్తోంది. ఆన్‌లైన్ బెట్టింగ్, రమ్మీ ప్రచారం కల్పించినవారిని విచారించాం. ప్రచారం కల్పించినవారిని విచారించడంతోనే ఈ సమస్యకు పరిష్కారం లభించినట్లు కాదు. సిట్ ఏర్పాటు చేసి వీటికి అడ్డకట్ట వేయాలని నిర్ణయించాం. ఆన్‌లైన్ బెట్టింగ్, నేరాల్లో ఏ రకంగా భాగస్వామ్యం ఉన్నా చర్యలు తప్పవు" అని సీఎం రేవంత్ హెచ్చరించారు.

### శాంతిభద్రతల విషయంలో ఎక్కడైనా రాజీపడ్డామా?

"శాంతిభద్రతల విషయంలోనూ కొందరు విమర్శలు చేస్తున్నారు. గత ప్రభుత్వం శాంతిభద్రతల విషయంలో ఎంత ఉదాసీనంగా ఉందో అందరికీ తెలుసు. దిశ ఘటన, న్యాయవాద దంపతుల హత్య వంటివి గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఉదాహరణలు. న్యాయవాద దంపతులను నడిరోడ్డుపై చంపేస్తే ఇప్పటికీ చర్యల్లేవు. సింగరేణి కాలనీలో ఆరేళ్ల బాలిక హత్యాచార ఉదంతంలో ఆనాడు చర్యలు తీసుకోలేదు. మహిళలపై దాడుల విషయంలో గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం నాలుగో స్థానంలో ఉంది. జూబ్లీహిల్స్ పబ్ కేసులో భారాస నాయకుడి కుమారుడే ఉన్నా పట్టించుకోలేదు. ఒక మంత్రి కుమారుడి ప్రమేయం ఉందని అప్పట్లో వార్తలొచ్చాయి. శాంతిభద్రతల విషయంలో దుష్ప్రచారం చేయడం ద్వారా రాష్ట్రానికి రావాల్సిన పెట్టుబడులను అడ్డుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రం కుప్పకూలిపోయిందని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రం దివాలా తీస్తే భారాస నేతలు సంతోషపడతారా? అధికార కాంక్షతో ఎలాంటి అసత్య ప్రచారమైనా చేస్తారా? ఈ 15 నెలల పాలనలో శాంతిభద్రతల విషయంలో ఎక్కడైనా రాజీపడ్డామా?" అని సీఎం ప్రశ్నించారు.

### ఆ ఇద్దరి పోటీతో మాకు తలనొప్పి వస్తోంది

"ధరల నియంత్రణలో దేశంలోనే తెలంగాణ నంబర్ వన్‌గా ఉంది. 85 శాతం సొంత పన్నుల వసూళ్లతో రాష్ట్రం అగ్రస్థానంలో ఉంది. కడుపునిండా విషం పెట్టుకొని ఎందుకు మాట్లాడుతారు? గతంలో జానారెడ్డి.. విపక్ష నేతగా ప్రభుత్వానికి సహకరించారు. జానారెడ్డి నెలకొల్పిన సంప్రదాయాన్ని ఎందుకని కొనసాగించరు? ఎన్నికలు ఎప్పుడో 2029లో వస్తాయి.. మీరు కోరుకున్నంతమాత్రాన ఇప్పుడే రావు. భారాస ముఖ్యనేతలు ఇద్దరు పోటీపడి మరీ దుష్ప్రచారం చేస్తున్నారు. ఆ ఇద్దరి పోటీతో మాకు తలనొప్పి వస్తోంది.నేను పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యేలకు అందుబాటులో ఉంటాను. గజ్వేల్ ఎమ్మెల్యే నా దగ్గరకు వచ్చినా మనస్ఫూర్తిగా సహకరిస్తాను. పద్మారావు వచ్చారు.. కొన్ని నియోజకవర్గ పనులు అడిగారు. అక్కడికక్కడే ఇచ్చేశా. విపక్ష ఎమ్మెల్యేలు వచ్చినా పనులు చేసి పెడుతున్నాను" అని సీఎం పేర్కొన్నారు.

## కాళేశ్వరం డిజైన్, నిర్మాణంలో తీవ్ర లోపాలు: మంత్రి ఉత్తమ్

మొదటి పేజీ తరువాయి



ఎస్ఎల్‌బీసీ సొరంగ ప్రమాదం దురదృష్టకరమని.. ప్రపంచస్థాయి నిపుణులను భాగస్వామ్యం చేసి సహాయక చర్యలను కొనసాగిస్తున్నట్లు ఉత్తమ్ తెలిపారు. ప్రమాదం జరిగిన 3 గంటల్లోపే తాను అక్కడికి వెళ్లినట్లు చెప్పారు. సీఎం రేవంత్ కూడా రెండు రోజుల క్రితం దీనిపై సమీక్షించి సహాయక చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారన్నారు. సొరంగ ప్రమాదం తాత్కాలికంగా వచ్చిన ఎదురుదెబ్బ మాత్రమేనని.. ఎస్‌–ఎల్‌బీసీ పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని చెప్పారు.తమ్మిడిహట్టి వద్ద ఆనకట్ట నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఆర్థిక, సాంకేతిక పరిశీలన కొనసాగుతోందని తెలిపారు. వీలైనంత త్వరగా పనులు చేపడతామన్నారు. తక్కువ ఖర్చుతో త్వరితగతిన ఎక్కువ ఆయకట్టుకు నీరిచ్చే ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. దేశంలోనే తొలిసారిగా ఈ నెల 30న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రేషన్ కార్డు దారులకు ఉచితంగా సన్న బియ్యం సరఫరాకు శ్రీకారం చుడుతున్నట్లు ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

## కేసీఆర్, హరీశ్‌రావును క్రిమినల్ ప్రాసిక్యూషన్ చేయాలి: భాజపా ఎమ్మెల్యే పాల్వాయి హరీశ

మొదటి పేజీ తరువాయి

"కాళేశ్వరం 8వ ప్రపంచ వింత అని పెయిడ్ ప్రచారం చేయించారు. ఆ ప్రాజెక్టుకు కేసీఆరే ఇంజినీర్. లూజ్ సాయిల్, లూజ్ ఫౌండేషన్ మీద కాళేశ్వరాన్ని నిర్మించడం పెద్ద తప్పు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కేసీఆర్, హరీశ్‌రావును క్రిమినల్ ప్రాసిక్యూషన్ చేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టి శీల పరీక్షను నిరూపించుకోవాలి" అని పాల్వాయి హరీశ్ వ్యాఖ్యానించారు.

# విజయవంతంగా ఆలయ ఫౌండేషన్ ఉచిత కంటి వైద్య శిబిరం



కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి

గోదావరిఖని సంజయ్ నగర్ 11 డివిజన్ లో పరికిపండ్ల నరహరి నిర్మించిన ఆలయ ఫౌండేషన్ ఉచిత కంటి ఆసుపత్రి ద్వారా శంకర ఐ హాస్పిటల్ ఇన్చార్జ్ పరికిపండ్ల రామ్ ఆధ్వర్యంలో ఆలయ ఫౌండేషన్ సభ్యులు లంక సురేష్ (11వ డివిజన్) సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లంక సురేష్ మాట్లాడుతూ ఆలయ ఫౌండేషన్ సేవలు మరింత విస్తరించాలని కోరుతూ వారు చేస్తున్న సేవలను కొనియాడారు. శిబిరం ద్వారా దాదాపు 300 మందికి పైగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో నుండి దాదాపు 100 మందికి కంటి సమస్యలు ఉన్న రోగులను హైదరాబాద్ నానాక్ రామ్ గూడాలోని శంకర్ ఐ విజన్ సెంటర్ కు పంపించడం జరుగుతుందని తెలిపారు. వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్ 9652034500, శంకర ఐ హాస్పిటల్, బసంత నగర్, పెద్దపెల్లి జిల్లాను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండేషన్ సీఈవో తీట్ల రమేష్ బాబు, డిప్యూటీ సీఈవో కీర్తి నాగర్జున, అడిషనల్ సీఈవో మిట్టపల్లి రాజేందర్ కుమార్, హాస్పిటల్ ఇంచార్జ్ పరికిపండ్ల రామ్, మాజీ కార్పొరేటర్ ఐత శివ, మహేష్ పటేల్, ఆలయ ఫౌండేషన్ వాలంటీర్స్ లంక నరేష్, గడ్డం రమేష్, దూడపాక సుకుమార్, జూడపాక సాగర్, వెంకటేష్, శ్రీనివాస్, బుల్లి సాగర్, కన్నా బెంజ్, అధిక సంఖ్యలో యువకులు, బస్తీ వాసులు మహిళలు, హాస్పిటల్ డాక్టర్ల బృందం, తదితరులు పాల్గొన్నారు.

# జిడీకే 2, 2ఏ ఇంక్లైన్ ను తనిఖీ చేసిన డి.డి.యం.యస్



కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి

రామగుండం డివిజన్ 1 పరిధి జిడీకే 2, 2ఏ ఇంక్లైన్ భూగర్భ గనిని బి.వెంకన్న డి.డి.యం.యస్ సందర్శించారు. ఈ సందర్భంగా భూగర్భ గనిలోని పని స్థలాలను తనిఖీ చేశారు. భూగర్భ గనిలో ఎస్ఎస్ 13/2 ప్యానెల్ పని స్థలము ను సందర్శించి అక్కడ ఉన్న పని స్థలములలో పైకప్పు మరియు సైడ్‌లను భద్రతతో కూడిన రక్షణ చర్యలను ఎప్పటికప్పుడు జాగర్తగా గమనిస్తూ పటిష్టమైన సపోర్ట్ చేయాలనీ అధికారులకు సూపర్ వైజర్ లకు తెలిపారు. ఈ మధ్యనే డబ్లుసీఎల్, సీఐఎల్ లో రూఫ్, సైడ్ ఫాల్ ప్రమాదాలు సంభవించాయని తెలిపారు. అటువంటి వాటికి ఆస్కారం లేకుండా భూగర్భ గనుల్లో పైకప్పు పడిపోవడం & సైడ్ ఫాల్ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. రక్షణతో కూడిన ఉత్పత్తి చేయాలనీ తెలిపారు. అనంతరం జిడీకే 2, 2ఏ ఇంక్లైన్ భూగర్భ గనికి సంబంధిత సర్వే రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు బి.సాయి ప్రసాద్, ఏరియా రక్షణ అధికారి, కె.చంద్ర శేఖర్, ఏజెంట్, డి.రమేష్ బాబు, సాట్యుటరి గని మేనేజర్, అల్లావుద్దీన్, గని మేనేజర్, డి.వెంకటేశ్వర్లు, సెఫ్టి ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో మరణించిన కుటుంబాలకు పరామర్శ



కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి

రామగుండం నియోజకవర్గం అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేట గ్రామంలో బండి ప్రసాద్ గౌడ్, మేరుగు కుమార్ గౌడ్, అనే ఇద్దరు గ్రామస్తులు, ఇటీవల ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఇంటి పెద్దను కోల్పోయిన రెండు కుటుంబాల సభ్యులను కలిసి పరామర్శించి, వీహెచ్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్గాం మండల మాజీ జడ్పిటిసి ఆముల నారాయణ చేతుల మీదుగా ఒక్కొక్కరికి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. వాళ్ళ కుటుంబానికి భవిష్యత్తులో పూర్తి భరోసాను అందిస్తామని వీహెచ్ఆర్ ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆముల నారాయణ మాట్లాడుతూ విషయాన్ని విహెచ్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డికి తెలుపగానే వెంటనే స్పందించి, వారి కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయంని అందించాల్సిందిగా తెలిపారని, వారికి పెద్దంపేట గ్రామ ప్రజలందరికీ తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నానీ, భవిష్యత్తులో బాధిత కుటుంబాలకు పూర్తి భరోసాను వీహెచ్ఆర్ ఫౌండేషన్ అందిస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దంపేట్ మాజీ సర్పంచ్ మేరుగు గురువయ్య, బీఆర్ఎస్ నాయకులు మధుకర్ రెడ్డి, పెద్దంపేట్, ఫౌండేషన్ సభ్యులు కోడిపుంజుల గురువేష్ తో పాటు, స్థానిక గ్రామ ప్రజలు, రామగుండం నియోజకవర్గ వివిధ డివిజన్ల వేహెచ్చర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# మధ్య దళారుల ను అరికట్టేందుకే సహకార సంఘాలు...

- సహకార సంఘాల అసిస్టెంట్ రిజిస్టర్ అశోక్ కుమార్...
- అధ్యక్షులు మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం...



**కరపత్రం శంకరపట్నం మార్చి 26**

రైతులను మధ్య దళారులు మోసం చేస్తున్నారని, కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్య తీసుకుని, సహకార సంఘాల ద్వారా మధ్య దళారుల ను మోసాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుందని, సహకార సంఘాల అసిస్టెంట్ రిజిస్టర్ అశోక్ కుమార్ అన్నారు. బుధవారం కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకరపట్నం మండలంలోని తాడికల్ గ్రామంలో గల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశాన్ని సంఘం అధ్యక్షులు కేతిరి మధుకర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు ఈ కార్యక్రమానికి సహకార సంఘాల రిజిస్టర్ అశోక రెడ్డి హాజరై మాట్లాడారు. రైతులకు అండగా ఉండేందుకు సహకార సంఘాల్లో కార్పొరేట్ బ్యాంకుల మాదిరిగా అన్ని సేవలను అందిస్తూ రైతులకు, అండగా ఉండేందుకు రైతులు పండించే ధాన్యాన్ని ప్రభుత్వాలు సహకార సంఘాల ద్వారా కొనుగోలు చేసి మద్దతు ధర, బోనస్ అందజేయడం జరుగుతుందని, సహకార సంఘాల ద్వారా రైతులకు మరిన్ని సేవలందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని, అందులో భాగంగా మధ్య దళారీ వ్యవస్థ నరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకొని, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రత్యేకంగా సహకార సంఘాల బలోపేతం కోసం కృషి చేస్తున్నాడని, రైతులకు సహకార సంఘాల ద్వారా, ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ, మరి కార్పొరేట్ బ్యాంకుల మాదిరిగా సేవలందించడం జరుగుతుందని, రైతులకు రుణాలతో కునాలతో పాటు, దీర్ఘకాలిక రుణాలను కూడా, బంగారం పైన, రుణాలు ఇవ్వడం జరుగుతుందని, రైతులు ఖాతాదారులు సహకార సంఘాల్లో తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండ చెల్లించి సహకార సంఘాల అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని, రైతులకు, ఖాతాదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు నరహరి వెంకటరమణారెడ్డి, పాలకవర్గ సభ్యులు కలకుంట్ల సత్యనారాయణ రావు, శిమిరాల శేషాచార్యులు, పద్మ, జూల శ్రీనివాస్, వెంగళ ప్రవీణ్, స్వరూప, సమ్మయ్య, సీఈఓ పోలు వీరస్వామి, అసిస్టెంట్ సీఈవో కొరిమి వేణు, సిబ్బంది, సతీష్ ,సాయికుమార్, మహేందర్ రైతులు, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

# బాయర్ వారి డికాల్బ్ 9217 కంకులతో అధిక దిగుబడి

- ప్రదర్శన క్షేత్రాన్ని పరిశీలించిన రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు




**కరపత్రం -చెన్నారావుపేట:**

బాయర్ కంపెనీ వారి డికాల్బ్ 9217 మొక్కజొన్న కంకులతో అధిక దిగుబడి సాధించవచ్చని తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు అన్నారు. చెన్నారావుపేట మండలం కోనాపురం గ్రామంలో అధిక దిగుబడిని ఇచ్చే బాయర్ కంపెనీ వారి డికాల్బ్ 9217 కంకులతో ప్రదర్శన క్షేత్రాన్ని ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న నాగుర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ మొక్కజొన్న పంట అధిక వర్షాలకు తట్టుకొని కింద పడకుండా ఉంటుందని అన్నారు. వరంగల్ రీజినల్ మేనేజర్ టి. అశోక్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ అందుబాటులో ఉన్న ఈ విత్తనాన్ని రైతులు వినియోగించుకోవాలని అన్నారు. ఇతర మొక్కజొన్న కంపెనీల రకాలతో పోలిస్తే ఇది మేలైనదని అన్నారు.బాయిర్ కంపెనీ ప్రతినిధులు మార్కెటింగ్ ఛాంపియన్ పి.నారాయణ రెడ్డి, వరంగల్ జిల్లా మేనేజర్లు సతీష్, శివేష్ లు మాట్లాడుతూ సన్నని బెండు, పొడవాటి కంకి కలిగి ఉండి, బెండు కొన వరకు గింజలు ఉండి, రైతులకు లాభసాటిగా ఉంటుందన్నారు. అలాగే రెండు రకాల వేరు వ్యవస్థల గురించి వివరించారు.ఈ క్షేత్ర ప్రదర్శనకు 200 మంది డీలర్లు, వివిధ గ్రామాల నుండి రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డికాల్బ్ 9217 విత్తనం బాగుండడంతో డీలర్స్,రైతులు హర్షం వ్యక్తం చేశారు.గత నాలుగు రోజుల నుండి ఈ ప్రదర్శన క్షేత్రాన్ని వీక్షించడానికి చుట్టుప్రక్కల ఉన్న గ్రామాల నుండి తండోపతండాలుగా రైతులు వచ్చి చూసి, సమాచారాన్ని తెలుసుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కమర్షియల్ మేనేజర్ అశోక్ రెడ్డి, వరంగల్ సిసిఎం సతీష్,పరకాల సి సి ఎం శివేష్, పలువురు డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై సర్కార్ ఉక్కుపాదం..

- సిట్ ఏర్పాటు నిర్ణయంపై ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి హర్షం..



**కరపత్రం శంకరపట్నం మార్చి 26**

యువకుల ప్రాణాలు తీస్తున్న ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై ఉక్కుపాదం మోపేందుకు సిట్ ఏర్పాటు చేయడం శుభ పరిణామమని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే సత్యనారాయణ పత్రికా ప్రకటన విడుదల చేశారు. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా మిగితా రాష్ట్రాల్లోనూ ఆన్లయిన్ బెట్టింగ్ వల్ల ఎంతోమంది యువకులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారని డాక్టర్ కవ్వంపల్లి ఆందోళన వ్యక్తం చేశారు. ఆన్లయిన్ బెట్టింగ్ లతో మరణిస్తున్న సంఘటనలు రోజురోజుకు వెలుగు చూసుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఆన్లయిన్ బెట్టింగ్ లు, గేమింగ్, రమ్మీ కేసులపై చర్యలకు ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ ఏర్పాటు చేస్తున్నట్లుగా అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ప్రకటన చేయడం సంతోషకరమని కవ్వంపల్లి పేర్కొన్నారు. బెట్టింగ్ యాప్‌లు, ఆన్లైన్ బెట్టింగ్లపై కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. సరదాగా మొదలైన ఈ బెట్టింగులు వ్యసనంగా మారి ప్రాణాలను బలిగొంటున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ ఉచ్చులోంచి బయట పడలేక, అప్పులు తీర్చలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. యువత, విద్యార్థులు పనులు మానేసి గంటల తరబడి ఆన్‌లైన్ గేమ్‌లు ఆడుతున్నారని, ఒక్కోసారి సహనం కోల్పోయి గొడవలకు దిగుతున్న సంఘటనలు కూడా లేకపోలేదని, వీటి నిరోధానికి పోలీసు నిఘా పెంచాల్సిన అవసరం ఉందన్నారు.బెట్టింగ్ నేరస్తులపైననే కాకుండా ఆన్లయిన్ బెట్టింగ్ యాప్ ను ప్రమోట్ చేసే వారిపైన కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని, ఈ దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందనే ఆశాభావాన్ని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి వ్యక్తం చేశారు.

# సింగరేణి ఆర్జి త్రీ లో ఉన్న కొనో కార్పస్ చెట్లను వెంటనే తొలగించాలి

**కరపత్రం రామగిరి ప్రతినిధి, మార్చ్ 26.**

బుధవారం సెంటనరీ కాలనీ,రాణి రుద్రమదేవి క్రీడా మైదానంలో బిజెపి నాయకులు గ్రౌండ్ ను పరిశీలించగా గ్రౌండ్లో చాలామంది మహిళలు,పిల్లలు,యోగా ఆటలు,వాకర్స్,కార్మికులు చాలామంది ఆరోగ్యరీత్యా గ్రౌండ్ ను ఉపయోగించుకుంటారు.ఈ గ్రౌండ్ లో సింగరేణి అధికారులు గత ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణ హరితహారంలో భాగంగా సింగరేణి అధికారులు కోను కార్బస్ చెట్లను నాటారు.ఈ చెట్ల వల్ల ఆక్సిజన్ రాదు,చెడు ఆక్సిజన్ వల్ల కార్మికులకు,పిల్లలకు ఆరోగ్య సమస్యలు వస్తాయి వాటిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వము అన్ని పట్టణాలలో ఈ యొక్క చెట్లను తొలగించాలని నిర్ణయం చేసింది.మన సింగరేణిలో ఉన్న సెంటనరి కాలనీ మార్కెట్ చౌరస్తాలో ఉన్న చెట్లను వెంటనే తొలగించాలని ఈ చెట్లు చాలా ప్రమాదకరమైనవి అని ఈ చెట్టు పైన ఏ ఒక్క పక్షి కూడా వాలదు,మేకలు ఈ చెట్ల ఆకులను తినవు,ఇవి చాలా ప్రమాదకరమైన చెట్లు వెంటనే ఈ చెట్లను సింగరేణి అధికారులు తొలగించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షులు బిజెపి మొలుమూరి శ్రీనివాస్,టౌన్ అధ్యక్షుడు తీగల శ్రీధర్,బూడిద సుమన్ పాల్గొన్నారు.

